ప్రశ్న:- ఒకే బలం మరియు ఒకే నమ్మకంపై నడిచేవారు ఏ విషయం యొక్క నిశ్చయం పెట్టుకుని నడుస్తూ ఉంటారు?

జవాబు:- ఒకే బలం, ఒకే నమ్మకం అంటే సదా నిశ్చయం ఉంటుంది - సాకార మురళి ఏదైతే ఉందో అదే మురళి, మధువనం నుండి ఏదైతే శ్రీమతం లభిస్తుందో అదే శ్రీమతం, బాబా మధువనంలో తప్ప ఇంకెక్కడ కలుసుకోరు. సదా ఒకే బాబా యొక్క చదువుపై నిశ్చయం ఉండాలి. మధువనం ద్వారా ఏదైతే చదువు చదివించబడుతుందో అదే చదువు, ఇక వేరే చదువు ఏదీ లేదు. ఒకవేళ భోగ్ వంటి సమయాలలో సందేశీల ద్వారా బాబా పాత్ర నడుస్తుంది అంటే అది పూర్తిగా తప్పు. ఇది కూడా మాయ. దీనిని కూడా ఒకే బలం, ఒకే నమ్మకం అనరు. మధువనం నుండి ఏదైతే మురళీ వస్తుందో దానిపై ధ్యాస ఉంచండి. లేకపోతే వేరే మార్గంలోకి వెళ్ళిపోతారు. మధువనంలోనే బాబా యొక్క మురళీ నడుస్తుంది. మధువనంలోనే బాబా వస్తారు. అందువలన ప్రతి ఒక్క పిల్లవాడు జాగ్రత్తగా ఉండాలి లేకపోతే మాయ మోసం చేసేస్తుంది.

## త్యాగి - మహాత్యాగి మధ్య తేడా ......13-4-82

బాప్‌దాదా బ్రాహ్మణాత్మలందరిలో సర్వస్వత్యాగి పిల్లలను చూస్తున్నారు. మూడు రకాలైన పిల్లలు ఉన్నారు -ఒకరు త్యాగి, రెండవవారు - మహాత్యాగి, మూడవ వారు - సర్వస్వత్యాగి. ముగ్గురు త్యాగులే కానీ నెంబర్‌వారీగా ఉన్నారు.

త్యాగి - ఎవరైతే జ్ఞానం మరియు యోగం ద్వారా తమ పాత సంబంధాలను, పాత ప్రపంచాన్ని, పాత వారి ద్వారా లభించిన అల్పకాలిక ప్రాప్తులను త్యాగం చేసి బ్రాహ్మణజీవితం అంటే యోగిజీవితాన్ని సంకల్పం ద్వారా పొందారు, అంటే ఈ అన్ని ధారణలు చేసారు - పాత జీవితం కంటే ఈ యోగిజీవితం శ్రేష్టం అని భావిస్తారు. అల్పకాలిక ప్రాప్తులు కంటే ఈ సదాకాలిక ప్రాప్తిని పొందటం అవసరం అని భావిస్తారు. అవసరం అని భావించడం ద్వారా జ్ఞానం, యోగం యొక్క అభ్యాసిగా అయ్యారు. బ్రహ్మాకుమారీ, కుమారులుగా పిలవబడడానికి అధికారులుగా అయ్యారు. కానీ బ్రహ్మాకుమారీ, కుమారులుగా అయిన తర్వాత కూడా పాత సంబంధాలు, సంకల్పాలు మరియు సంస్కారాలు పూర్తిగా పరివర్తన అవ్వలేదు కానీ పరివర్తన చేసుకునే యుద్ధంలో తత్పరులై ఉన్నారు. ఇప్పుడిప్పుడే బ్రాహ్మణ సంస్కారంలో ఉంటున్నారు మరియు ఇప్పుడిప్పుడే పాత సంస్కారాలను పరివర్తన చేసుకునే యుద్ధ స్వరూపంలో ఉంటున్నారు. త్యాగిగా అయ్యారు కానీ సంపూర్ణ పరివర్తన అవ్వలేదు అని వీరినే అంటారు. త్యాగం చేయటమే మహాభాగ్యం అని కేవలం ఆలోచించేవారిగా మరియు అర్ధం చేసుకునేవారిగా ఉంటార, చేసే ధైర్యం తక్కువగా ఉంటుంది. సోమరితనం యొక్క సంస్కారం మాటిమాటికి ప్రత్యక్షం అవుతున్న కారణంగా త్యాగంతో పాటు వెనువెంట విశ్రాంతికి ఇష్టమైనవారిగా కూడా అవుతారు. అర్ధం చేసుకుంటారు కూడా, నడుస్తారు కూడా, పురుషార్ధం కూడా చేస్తారు బ్రాహ్మణజీవితాన్ని వదలరు. బ్రాహ్మణులుగా అవ్వాలి అనే ధృడసంకల్పం కూడా ఉంటుంది. మాయ లేదా మాయ యొక్క పాత జీవితం ఆకర్షితం చేసినా బ్రాహ్మణజీవితమే శ్రేష్టమైనది అనే సంకల్పంలో స్థిరంగా ఉంటారు. దీనిలో


Created by Universal Document Converter

నిశ్చయబుద్ధిగా, పక్కాగా ఉంటారు. కానీ సంపూర్ణత్యాగిగా అవ్వడానికి రెండు రకాలైన విఘ్నాలు ముందుకు వెళ్ళనివ్వటంలేదు. అవి ఏమిటి? ఒకటి - సదా ధైర్యం పెట్టుకోలేకపోతున్నారు అంటే విఘ్నాలను ఎదుర్కునే శక్తి తక్కువగా ఉంటుంది. రెండు - సోమరితనం యొక్క సంస్కారంతో విశ్రాంతికి ఇష్టమైన వారిగా అయ్యి నడవటం. చదువు, ధారణ, స్మృతి, సేవ అన్ని సబ్జెక్టులను చేస్తున్నారు, నడుస్తున్నారు, చదువుకుంటున్నారు కానీ విశ్రాంతిగా చేస్తున్నారు. సంపూర్ణ పరివర్తన చేయడానికి శస్త్రధారిగా అయ్యే శక్తి స్వరూపం లోపంగా ఉంటుంది. స్నేహిగా ఉంటారు కానీ శక్తిస్వరూపంగా ఉండరు. మాస్టర్ సర్వశక్తివాన్ స్థితిలో స్థితులు కాలేరు. అందువలనే మహాత్యాగిగా కాలేకపోతున్నారు. వీరు త్యాగి ఆత్మలు.

మహాత్యాగి - సదా సంబంధం, సంకల్పం మరియు సంస్కారాలు అన్నింటిని పరివర్తన చేసుకునే ధైర్యం మరియు ఉల్లాసంలో ఉంటారు. పాత ప్రపంచంతో, పాత సంబంధాలతో సతా అతీతంగా ఉంటారు. వారికి ఈ పాత ప్రపంచం, పాత సంబంధీకులు చనిపోయినట్లు అనుభవం అవుతుంది. దీని కోసం యుద్ధం చేయవలసిన అవసరం ఉండదు. సదా స్నేహి, సహయోగి, సేవాధారి శక్తి స్వరూపం యొక్క స్థితిలో ఉంటారు ఇక ఏమి మిగిలిపోతుంది. మహాత్యాగిగా అయిన దానికి ఫల స్వరూపంగా, త్యాగానికి భాగ్యంగా - మహాజ్ఞాని, మహాయోగి, శ్రేష్ట సేవాధారిగా అవుతారు. ఈ భాగ్యం యొక్క అధికారాన్ని అక్కడక్కడ వ్యతిరేక నషా రూపంలో ఉపయోగిస్తుంటారు. వెనుకటి జీవితాన్ని సంపూర్ణత్యాగం చేసారు కానీ త్యాగాన్ని కూడా త్యాగం చేయలేదు. ఇనుప సంకెళ్ళను అయితే త్రెంచేసుకున్నారు, ఇనుపస్థితి నుండి బంగారుస్థితిలోకి వస్తారు కానీ పరివర్తన అయిన బంగారుజీవితం యొక్క బంగారు సంకెళ్ళలో అక్కడక్కడ చిక్కుకుపోతున్నారు. ఆ బంగారు సంకెళ్ళు ఏమిటి? నేను మరియు నాది. నేను మంచి జ్ఞాని ఆత్మను, యోగి ఆత్మను అనే ఈ బంగారు సంకెళ్ళు అక్కడక్కడ సదా బంధనముక్తులుగా అవ్వనివ్వటంలేదు. మూడు రకాలైన ప్రవృత్తులు ఉన్నాయి. -1. లౌకిక సంబంధాలు లేదా లౌకిక కార్యం యొక్క ప్రవృత్తి 2. మీ శరీరం యొక్క ప్రవృత్తి 3. సేవ యొక్క ప్రవృత్తి.

త్యాగి ఆత్మలు లౌకిక ప్రవృత్తి నుండి అతీతం అయిపోయారు కానీ దేహం యొక్క ప్రవృత్తిలో, తమని తాము నడిపించుకోవటంలో మరియు తయారు చేసుకోవటంలో నిమగ్నమై ఉండటం లేదా దేహ భ్రాంతి యొక్క సంస్కారానికి వశీభూతం అవ్వటం మరియు ఆ సంస్కారంతోనే మాటిమాటికి ధైర్యహీనులుగా అయిపోతున్నారు. దాని గురించి స్వయం కూడా వర్ణన చేస్తున్నారు, అర్ధం చేసుకుంటున్నారు, తయారవ్వాలనుకుంటున్నారు కానీ మరలా నా సంస్కారం అంటున్నారు. ఇది దేహాభిమానం యొక్క లేదా దేహం యొక్క ప్రవృత్తి. శక్తి స్వరూపంగా అయ్యి ఈ ప్రవృత్తి నుండి నివృత్తి కాలేకపోతున్నారు. ఇది త్యాగి ఆత్మల యొక్క విషయం కానీ మహాత్యాగులు లౌకిక ప్రవృత్తి, దేహ ప్రవృత్తి రెండింటి నుండి నివృత్తి అయిపోతారు కానీ సేవా ప్రవృత్తిలో నివృత్తి అవ్వడానికి బదులు అక్కడక్కడ చిక్కుకుపోతారు. అటువంటి ఆత్మలకు తమ దేహం యొక్క అభిమానం కూడా సతాయించదు ఎందుకంటే రాత్రి పగలు సేవలో నిమగ్నమై ఉంటారు. దేహం యొక్క ప్రవృత్తి నుండి అతీతం అయిపోతారు ఈ రెండింటిని త్యాగం చేసిన దానికి భాగ్యంగా - జ్ఞానిగా, యోగిగా అవుతారు, శక్తులు, గుణాలు లభిస్తాయి, బ్రాహ్మణ పరివారంలో ప్రసిద్ధ ఆత్మగా అవుతారు, సేవాధారులలో వి.ఐ.పిగా అవుతారు, మహిమ యొక్క పూల వర్షం కురవటం ప్రారంభం

Created by Universal Document Converter

అవుతుంది, మహిమాయోగ్యంగా అవుతారు కానీ సేవా ప్రవృత్తి యొక్క ఈ విస్తారం ఏదైతే ఉందో ఆ విస్తారంలోకి వెళ్ళిపోయి చిక్కుకుపోతున్నారు. మహాదానిగా అయ్యి, ఈ సర్వ ప్రాప్తులను కూడా ఇతరులకు దానం చేయడానికి బదులు స్వయం స్వీకరించేస్తున్నారు. కనుక నేను మరియు నాది అనే శుద్ధ భావన యొక్క సంకెళ్ళుగా తయారైపోతున్నాయి. భావం మరియు మాట చాలా శుద్ధంగా ఉంటాయి మేము మా కోసం చెప్పటంలేదు, సేవ కోసం చెప్తున్నాము అంటారు. నేను యోగ్య టీచర్ అని నేను చెప్పుకోవటం లేదు, కానీ ప్రజలు నన్ను అడుగుతున్నారు అంటారు. మీరే సేవ చేయండి అని జిజ్ఞాసువులు అంటున్నారు అంటారు. నేనైతే అతీతుడనే కానీ ఇతరులు నన్ను ప్రియంగా చేస్తున్నారు అంటారు. దీనిని ఏమంటారు? వారు బాబాని చూసారా లేక మిమ్మల్ని చూసారా? మీ యొక్క జ్ఞానం మంచిగా అనిపిస్తుంది లేదా మీ యొక్క సేవ మంచిగా అనిపిస్తుంది అంటే బాబా ఎక్కడికి వెళ్ళిపోయారు? బాబాని పరంధామనివాసిగా చేసేసారు! అందువలన ఈ భాగ్యాన్ని కూడా త్యాగం చేయండి. మీరు కనిపించకూడదు, బాబా కనిపించాలి. మహాన్ ఆత్మకి ప్రేమిగా చేయకండి, పరమాత్మ ప్రేమిగా చేయండి. అన్ని ప్రవృత్తులను దాటి ఈ చివరి ప్రవృత్తిలో సర్వస్వత్యాగి అవ్వటంలేదు, మహాత్యాగి అయ్యారు కానీ సర్వస్వత్యాగి అవ్వటంలేదు. ఇక మిగిలినది – సర్వస్వత్యాగులు గురించి.

త్యాగం యొక్క కోర్సులో ఇది చివరి పాఠం మరియు సంపన్న పాఠం. చివరి పాఠం ఉండిపోయింది. అది తర్వాత చెప్తాను. ఎందుకంటే 83 సం॥రంలో మహా యజ్ఞం చేస్తున్నారు, మహాన్ స్థానంలో చేస్తున్నారు కనుక అందరు ఏదోకటి ఆహుతి చేస్తారు కదా లేక హాల్ ఒకటే తయారు చేస్తారా! ఇతరులకు సేవ అయితే చేస్తారు కదా! బాబా యొక్క ప్రత్యక్షతా ధ్వనిని వ్యాపింపచేసే పెద్ద –పెద్ద మైక్‌లను కూడా తీసుకువస్తారు ఈ ప్లాన్ తయారు చేసారు కదా! కానీ బాబా ఒంటరిగా ప్రత్యక్షం అవుతారా లేక శివశక్తులు ఇద్దరు ప్రత్యక్షం అవుతారా! శక్తిసేనలో ఇద్దరూ (అన్నయ్యలు, అక్కయ్యలు) వస్తారు. అయితే బాబా పిల్లల సహితంగా ప్రత్యక్షం అవుతారు. మైక్ ద్వారా ధ్వని వ్యాపింపచేయడానికి ప్లాన్ ఆలోచించారు కానీ విశ్వంలో ధ్వని వ్యాపిస్తుంది మరియు ప్రత్యక్షత యొక్క పరదా తెరుచుకుంటుంది అంటే పరదా లోపల నుండి బయటకి ప్రత్యక్షం అయ్యే మూర్తులు కూడా సంపన్నం అవ్వాలి కదా! లేక పరదా తెరుచుకునే సరికి కొంతమంది తయారవుతున్నట్లు, కొంతమంది కూర్చుంటున్నట్లు సాక్షాత్కారం చేయంచకూడదు కదా! కొందరు శక్తి స్వరూపం యొక్క ఢాలు పట్టుకుంటూ, కొందరు కత్తి పట్టుకుంటున్నట్లు ఇలాంటి ఫోటో తీయించుకోరు కదా! కనుక ఏమి చేయాలి? సంపూర్ణస్వాహా అవ్వాలి. దీని యొక్క ప్రోగ్రామ్ కూడా తయారు చేసుకోవాలి. కనుక ఈ మహాయజ్ఞంలో బంగారు సంకెళ్ళను కూడా స్వాహా చేయాలి. కానీ దానికొరకు ఇప్పటి నుండి అభ్యాసం కావాలి. 83వ సంవత్సరంలో చేస్తాము అని కాదు. మీరు ఏవిధంగా అయితే మొదట సేవాధారిగా అవుతారు, సమర్పణ సమారోహం తర్వాత అవుతుంది అదేవిధంగా ఇది కూడా సర్వ స్వాహా సమారోహం 83 సంవత్సరంలో చేయాలి కానీ దీనికి చాలా కాలం యొక్క అభ్యాసం ఉండాలి. మంచిది.

ఈవిధంగా సదా బాబా సమానంగా సర్వస్వత్యాగి ఆత్మలకు, సదా బ్రహ్మాబాబా సమానంగా భాగ్యాన్ని కూడా మహాదానిగా అయ్యి పంచేవారికి, సదా బాబా యొక్క నమ్మకదారులకు, ఆజ్ఞాకారి బాబాని అనుసరించే శ్రేష్ఠ ఆత్మలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

Created by Universal Document Converter